# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక




పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు నమస్తే ఉదయం
**వినాయక చవితి**
**శుభాకాంక్షలు**
పండుగ సందర్భంగా నేడు సెలవు.
గురువారం సంచిక వెలువడదు.
పునఃదర్శనం శుక్రవారం.
- ఎం.దామోదర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్


సంపుటి: 3 | సంచిక: 6 | పేజీలు: 5 | వెల: రూ.4/- | బుధవారం 27 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# ఇక మనమే గ్లోబల్ హబ్

**క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం.. ఇక మనమే గ్లోబల్ హబ్: ప్రధాని మోదీ**

**అహ్మదాబాద్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తికి శ్రీకారం**

**100 దేశాలకు 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులు ప్రారంభం**

**క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో భారత్ ప్రపంచ హబ్‌గా మారుతుందన్న ప్రధాని**

**భారత్‌లో బ్యాటరీల తయారీ కోసం మూడు జపాన్ కంపెనీల భాగస్వామ్యం**

**పెట్టుబడుల కోసం రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని మోదీ పిలుపు**

**సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలపై ఇకపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్న ప్రధాని**




**అహ్మదాబాద్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం)**

ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమతుల రంగంలో భారత్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈవీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించడం విశేషం.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. "గతంలో ఈవీలకు అత్యంత కీలకమైన బ్యాటరీలను మనం పూర్తిగా దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. మూడు ప్రముఖ జపాన్ కంపెనీలు కలిసి భారత్‌లోనే

..మిగతా 2లో



# బీహార్‌లో రాహుల్ ఓటర్ అధికార యాత్ర

## పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి, మంత్రులు

**పట్నా: ఆగస్టు 26 (నమస్తే ఉదయం)**

ఓటర్ల జాబితాలో లోపాలను ఎత్తిచూపుతూ బిహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. బీహార్‌లో ఓటర్ అధికార యాత్ర తిరిగి ప్రారంభమైంది. మంగళ వారం బీహార్‌లోని సుపాల్ లో సాగుతున్న ఓటర్ అధికార్ యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కలసి ప్రియాంకగాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఆర్జేడీనేత తేజస్వి యాదవ్, ఇండియా బ్లాక్‌కు చెందిన ఇతర ప్రతినిధులతో పాటు నేతలంతా కారు పైకప్పుపై కూర్చుని ప్రజలకు అభివాదం చేశారు. ఒకరోజు విరామం తీసుకున్న వోట్ అధికార్ యాత్ర మంగళ వారం

..మిగతా 2లో

# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు



**కాళేశ్వరం కమిషన్‌పై చర్చించే అవకాశం**

**హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం)**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అంతకు ముందు రోజు అంటే 29వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అలాగే బిసి

..మిగతా 2లో

# నేడు ఖైరతాబాద్ వినాయకుడికి ప్రాణప్రతిష్ట

**ప్రత్యేక ఏర్పాట్లతో పాటు బందోబస్తు**

**ట్రాఫిక్ మళ్లింపు.. ప్రకటించిన పోలీసులు**



**హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం)**

గణేశ్ ఉత్సవాల్లో ఖైరతాబాద్ గణేశుడికి ఏటా ఆదరన పెరుగుతోంది. ప్రతిరోజూ లక్ష నుంచి రెండు లక్షల మంది భక్తులు ఖైరతాబాద్ గణపతి వద్దకు వస్తుంటారు. ఇక వారాంతపు రోజులైన శని, ఆదివారాల్లో ఈ సంఖ్య 3 నుంచి 5 లక్షల వరకు ఉంటుంది. ఈసారి ఇంతకు మించి భక్తులు వస్తారనే అంచనాల నేపథ్యంలో ఖైరతాబాద్ గణపతి వద్ద పోలీసులు ఎప్పుడూ లేనంత బందోబస్తును

..మిగతా 2లో

# ఓట్ చోరీ అంటూ ప్రజలను అవమానిస్తున్న కాంగ్రెస్



**కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల**

**ఇచ్చిన హామీలు నిలుపుకోలేక నానా తంటాలు**

**ఓట్ చోరీ అంటూ**

**ప్రజలను అవమానిస్తున్న కాంగ్రెస్**

**ఓట్ చోరీ జరిగితే బిజెపి 16 సీట్లు గెలిచేది**

**పిసిసి చీఫ్ వ్యాఖ్యలకు బండి సంజయ్ కౌంటర్**

**కరీంనగర్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే.. రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వాగ్దానాలు అమలుకాలేదని, మోసపూరిత హామీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ పార్టీకి మళ్లీ అధికారం కలేనని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు ఏమయ్యాయో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలని బండి సవాల్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించిన సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. దొంగ ఓట్లు

..మిగతా 2లో

# ఓట్ చోరీ అంటూ ప్రజలను అవమానిస్తున్న కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు- వేయడం ఎవరికైనా సాధ్యమా?అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు- బ్యాంకు ముఖ్యమా? అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయని బండి సంజయ్ విమర్శించారు. ప్రజలను కలవకుండా రాత్రి పూట యాత్రలు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. టీ-పీసీసీ చీఫ్ ఒక గజినీ.. ఆయనను ఎవరైనా గుర్తు పడతారా అని ప్రశ్నించారు.



మహేష్ గౌడ్ వార్డు మెంబర్‌గా కూడా గెలిచావా అని బండి సంజయ్ నిలదీశారు. తెలంగాణలో ఓటు- చోరీ జరిగితే.. కాంగ్రెస్ ఎనిమిది ఎంపీ సీట్లు కూడా తామే గెలిచే వాళ్లమని చెప్పుకొచ్చారు. ప్రజల ఓట్లతో మహేష్ గౌడ్ ఒక్కసారైనా గెలవాలని ఛాలెంజ్ చేశారు. కర్ణాటక, తెలంగాణలో మీరెలా గెలిచారని ప్రశ్నించారు. టీపీసీసీ చీఫ్ బీఆర్ఎస్ మనిషి అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆయనకు సెక్యూరిటీ- కావాలని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఓటు- చోరీ జరిగిందని ప్రజలను మహేష్ గౌడ్ అవమానిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నేతలే ఓట్ల బిచ్చగాళ్లు అని విమర్శించారు. టోపీలు పెట్టుకుని ఓట్ల కోసం వెళ్లేది కాంగ్రెస్ నేతలే అని ఆక్షేపించారు. రోహింగ్యాలు వచ్చింది కాంగ్రెస్ హయాంలోనేనని బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్రం నిధుల కోసమే ఇప్పుడు స్థానిక ఎన్నికలు జరుగుతాయని బండిసంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పంచాయితీలకు ఒక్క పైసా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. 6 గ్యారెంటీలపై ప్రజలు కొట్టేట్లు ఉన్నారని, కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. కరీంనగర్ లో ఒక్కో మైనార్టీ ఇంట్లో 200 ఓట్లున్నాయని పేర్కొన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ లో అధికారం ఎలా వచ్చిందని బండి ప్రశ్నించారు. ఎన్నికలున్నా.. లేకున్నా హిందూ ధర్మం కోసం నిలబెడతాం అని స్పష్టం చేశారు. భైంసాలో హిందువుల ఇళ్లు తగలబెట్టినప్పుడు వాళ్లెక్కడికి వెళ్లారని నిలదీశారు. తమది దేవుళ్ల పార్టీ అని మీది బిచ్చపు బతుకు అని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మం కోసం బిజెపి నిలబడుతుందని, యుపిఎ హయాంలోనే రోహింగ్యాలు దేశంలోకి వచ్చారని తెలిపారు. కరీంనగర్ లో హిందూ ఓటు- ద్వారానే గెలిచానని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## బీహార్‌లో రాహుల్
# ఓటర్ అధికార యాత్ర

మొదటి పేజీ తరువాయి...

తిరిగి ప్రారంభమైంది. ఆదివారం అరారియాలో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీమాట్లాడుతూ..బీహార్‌లోని అన్ని భారత కూటమి నియోజకవర్గాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఐక్యంగా పనిచేస్తున్నాయన్నారు. మంచి ఫలితాలుంటాయని చెప్పారు. ప్రతిపక్ష కూటమిలోని అన్ని నియోజకవర్గాలు ఐక్యంగా పనిచేస్తున్నాయి. మేం సైద్ధాంతికంగా,రాజకీయంగా కలుపుకుపోతున్నామన్నారు. పరస్పరం ఒకరినొకరు గౌరవించుకుంటూ పోతున్నామన్నారు. బీహార్ ఎన్నికల సందర్భంగా ఇండియా కూటమి త్వరలో మేనిఫెస్టోను విడుదల చేస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. సుపౌల్‌లో నిర్వహించిన పాదయాత్రకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన హాజరయ్యారు. సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## నేడు ఖైరతాబాద్ వినాయకుడికి ప్రాణప్రతిష్ట

మొదటి పేజీ తరువాయి...

నిర్వహించనున్నారు. ఈ విషయమై సైఫాబాద్ ఏసీపీ ఆర్. సంజయ్‌కుమార్ వివరాలను మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. ఇక్కడ ఆరుగురు డీఎస్పీలు, 23 మంది ఇన్‌స్పెక్టర్లు, 52 మంది ఎస్ఐలు, 150 మంది కానిస్టేబుళ్లు, 50 మంది మహిళా కానిస్టేబుళ్లు, 22 ప్లటూన్ల సిబ్బందిని వినయోగిస్తున్నట్లు- తెలిపారు. ప్రతి రోజూ తరచుగా డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తాయని, 60 సీసీ కెమెరాల ద్వారా భక్తుల భద్రతను సమీక్షిస్తామని తెలిపారు. అన్ని మార్గాల్లో డోర్ ఫ్రేం, హ్యాండ్ మెటల్ డి-టె-క్టర్లతో భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకే దర్శనానికి అనుమతి ఉంటుందన్నారు. భక్తులు విలువైన ఆభరణాలను, వస్తువులను తీసుకొని రాకూడదని తెలిపారు. ఉత్సవ కమిటీల ప్రతినిధులు అతిథులు, వీఐపీలను సాధ్యమైనంత వరకు ఉదయం నుంచి మధ్యాహ్నంలోపే వచ్చేలా ఆహ్వానించాలని కోరారు. ఉత్సవ కమిటీ- తరఫున 100 మంది ప్రైవేట్ సెక్యూరిటీ- సిబ్బందిని తమకు అందించాలని పోలీసులు కోరారు. తమ సిబ్బందికి అదనంగా వారి సేవలను 3 షిఫ్టుల్లో వాడుకుంటామని, మొత్తం 100 మందిని తమకు అప్పగిస్తే వారికి పోలీసు అధికారులు అవసరం మేరకు వినియోగించుకుంటారని ఏసీపీ సంజయ్ కుమార్ తెలిపారు. ఖైరతాబాద్‌లో బుధవారం బడా గణేశ్ కొలువు దీరనున్నాడు. గణనాథుడిని చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ చుట్టుపక్కల పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించారు. ఖైరతాబాద్, షాదన్ కాలేజీ, నిరంకారి, ఓల్డ్ పీఎస్ సైఫాబాద్, మింట్‌కాంపౌండ్, నెక్లస్ రోటరీ వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు ఎక్కువ అని తెలిపారు. ఈ నేపథ్యంలో పది రోజులపాటు- వాహనాలు దారిమళ్లింపులు ఉంటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు.




జిల్లా కేంద్రంలో మట్టి వినాయకులను ఉచితంగా పంపిణి చేస్తున్నా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ ) పింకేష్ కుమార్

## పర్యావరణ పరిరక్షణకు
# మట్టి వినాయకులనే పూజిద్దాం

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్**

జనగామ, ఆగష్టు 26 (నమస్తే ఉదయం): వివిధ రంగులతో, విష రసాయనాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలు జలజీవ రాశులకు కలిగిస్తున్నందున భక్తులు వినాయక చవితి పండుగ మట్టి ప్రతిమలను పూజకు వినియోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ కోరారు.మంగళవారం పట్టణంలోని నెహ్రూ చౌక్ వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సరఫరా చేసిన మట్టి విగ్రహాలను మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ భక్తులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. పర్యావరణ హితం కోరేందుకు వివిధ ఆకర్షణీయమైన రంగులతో తయారు చేసిన వినాయక ప్రతిమలు పూజలకు వినియోగించరాదని తద్వారా పర్యావరణ పరిరక్షణకు నష్టం వాటిల్లుతుందని రంగు రంగుల విగ్రహాలు నిమజ్జనంలో విష రసాయనాలు వెదజల్లడం ద్వారా జల కాలుష్యాన్ని పెంచుతాయని, తద్వారా జల జీవరాశులు అంతరించిపోతాయి అన్నారు.మట్టి ప్రతిమ లను పూజించి సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరం భాగస్వాములమవుదామన్నారు.అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## స్థానిక ఎన్నికల
# కసరత్తు ముమ్మరం

**ఓటర్ల జాబితా...విడుదలకు ఇసి నోటిఫికేషన్**

**28 లోపు ముసాయిదా జాబితా ప్రకటన**

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం)

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫోటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది. ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరునాడే అంటే ఆగస్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడిరచింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫోటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణకు ఆదేశించింది. ఇదిలావుంటే తెలంగాణ కేబినెట్ సమావేశం ఆగస్టు 29న మధ్యాహ్నం 3:30గంటలకు జరగనుంది. సెక్రటేరియట్ లో సీఎం రేవంత్ అధ్యక్షతన ఈ భేటీ జరగనుంది. బీసీ రిజర్వేషన్లు, అసెంబ్లీ సమావేశాల తేదీ ఖరారు, సర్పంచ్ ఎన్నికలు,కాళేశ్వరం నివేదికపై ప్రధానంగా ఈ భేటీ-లో చర్చించనున్నారు. ముఖ్యంగా అందరు ఎదురు చూస్తోన్న పంచాయతీ ఎన్నికల నిర్వాహణపై ఈ కేబినెట్ భేటీలో క్లారిటీ రానుంది. సెప్టెంబర్ 30 లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలపై స్పష్టత కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతంరిజర్వేషన్లు కల్పించే బిల్లు, పంచాయతీ రాజ్ చట్ట సవరణ ఆర్డినెన్స్ కేంద్రం వద్ద పెండిరగ్‌లో ఉండటంతో రిజర్వేషన్లపై ఇప్పటికే న్యాయ నిపుణుల సలహా తీసుకుంది సబ్ కమిటీ ఆగస్టు 28 లోపు ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనుంది . సబ్ కమిటీ ఇచ్చే నివేదికపై కేబినెట్ లో చర్చించి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనుంది.



# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

మొదటి పేజీ తరువాయి...

రిజర్వేషన్లపై ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపై మరోమారు చర్చించే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాల్లో కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు- తెలుస్తోంది. ఈ సమావేశాల్లోనే సభ్యులందరికీ కమిషన్ రిపోర్ట్‌ను ప్రభుత్వం అందించనుంది. కాగా, అసెంబ్లీ సమావేశాలు 5 రోజుల పాటు- నిర్వహించే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. అయితే దీనిపై అధికార ప్రకటన వెలువడాల్సి ఉంది.




# ఇక మనమే గ్లోబల్ హబ్

మొదటి పేజీ తరువాయి...

బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రోడ్‌లను తయారు చేస్తున్నాయి. ఇది మన దేశ హైబ్రిడ్ వాహనాల మార్కెట్‌కు కొత్త ఊపునిస్తుంది” అని ఆయన వివరించారు.

భారత్-జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. “సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది” అని మోదీ వ్యాఖ్యానించారు.

గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, ‘మేక్ ఇన్ ఇండియా’ వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. “వ్యాపార అనుకూల వాతావరణం, లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో పెట్టుబడులకు అనువైన మార్గాలను సృష్టించాం. ఫలితంగా పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగింది” అని అన్నారు.

భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, “మేం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి. అదేవిధంగా కీలక ఖనిజాల కోసం ‘నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్’ను ప్రారంభించాం” అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.




సమావేశంలో పాల్గొన్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలు

## అంగన్వాడీ శేరిలింగంపల్లి ప్రాజెక్టు అధ్యక్షురాలుగా నాగమణి

బుద్వేల్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం): కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టిన విదంగా అంగన్ వాడీ టీచర్లకు, ఆయా లకు నెల నెల రూ. 26వేల వేతనాన్ని ఇవ్వాలని సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు మహా సభ మంగళవారం కాటేదాన్ సీఐటీయు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగన్ వాడీ టీచర్లు, అయాలనుద్దేశించి ఆయన మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ఇన్సూరెన్స్, రీటర్మెంట్ బెనిఫిట్స్, అంగన్ వాడీ పాఠశాలలకు నూతన భవనాలు, లాప్ టాప్ ల అందజేత లాంటి హామీలను నెరవేర్చాలన్నారు.

**నూతన కమిటీ**

శేరిలింగంపల్లి ప్రాజెక్టు అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలుగా నాగమణి, కార్యదర్శిగా సుధా, కోశాధికారిగా అనిత, ఉపాధ్యక్షురాలుగా శ్రీలత, షమీం, సహాయ కార్యదర్శిగా మాదవి, సువర్ణ, కమటీ లో 22 మంది సభ్యులను నియమించారు.



# కాంగ్రెస్ హాయంలోనే అభివృద్ధి

**ఎమ్మెల్యే జిఎంఆర్**

**అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జిఎంఆర్**

కొత్తకోట, ఆగస్టు 26(నమస్తే ఉదయం) కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు గవినోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలో ని ప్రభుత్వ పాఠశాలలలో టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ మేళకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు.అనంతరం మున్సిపాలిటీ కేంద్రంలోని పలు వార్డులలో సిసి రోడ్లు, ప్రారంభోత్సవాలు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే తప్ప ఏ ప్రభుత్వంలో చేపట్టలేదని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, ఎంఈఓ కృష్ణయ్య, ఫారుక్ హుస్సేన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీచుపల్లి యాదవ్, డాక్టర్ పి జె.బాబు, బోయేజ్,కృష్ణారెడ్డి, మేస్త్రి శ్రీనివాసులు, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఎండి లతీఫ్, సలీం ఖాన్, మిషేక్,అమ్మపల్లి బాలకృష్ణ, నవీన్, సుభాష్, సంధవెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ వర్శిటీలో టీచింగ్ ఉద్యోగులపై ఉన్నతాధికారుల నిరంకుశ వైఖరికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో రాష్ట్ర వ్యాప్త నిరసన



రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో గల ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి, వినూత్నంగా నిరసన తెలుపుతున్న టాసా ప్రతినిధులు




పాలెం వ్యవసాయ కళాశాల ఆవరణలో నల్ల బ్యాడ్జి లతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు




జగిత్యాల లో నల్ల బ్యాడ్జి లతో నిరసన

## ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అంటు రిజిస్ట్రార్ అవమానపరిచాడంటు ఆవేధన

బుద్వేల్, ఆగస్టు 26(నమస్తే ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత కొన్ని నెలలుగా వర్శిటీ యాజమాన్యం అధ్యాపకులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తుండటంతో మంగళవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలను దరించి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టారు. తమ సమస్యలను రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి వినతి పత్రం రూపంలో అందజేసి వినూత్నంగా నిరసన తెలిపారు. తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్, రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం. పాలెం వ్యవసాయ కళాశాల, జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టాసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె పవన్ చంద్రారెడ్డి, డాక్టర్ సల్లా సౌజన్య , ఉపాధ్యక్షులు డాక్టర్ జె .కమలాకర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ రమేశ్, కోశాధికారి డాక్టర్ పి. ప్రశాంత్ లతో పాటు పలువురు అధ్యాపకులు మాట్లాడారు. ఇటీవల యూనివర్శిటీ యాజమాన్యం తీసుకువచ్చిన ట్రాన్స్ ఫర్ పాలసీలో పారదర్శకత లోపించిందన్నారు. ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చిందన్నారు. ట్రాన్స్ ఫర్ ట్రావెలింగ్ అలవెన్సు ఇవ్వకుండ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఇటీవల జరిగిన ప్రమోషన్స్ లో కూడా ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇటీవల తీసుకువచ్చిన సీఏఎస్ స్కోర్ కార్డు వలన భవిష్యత్తులో ఉద్యోగులకు ప్రమోషన్లు ఒక కలలాగే మిగిలే ఆస్కారం ఏర్పడిందన్నారు. పీజీ అర్హత తో ఉద్యోగాలలో చేరిన వారికి ఇన్ సర్వీస్ కోటా లో పీహెచ్ డీ ఇవ్వకుండ తీవ్ర అన్యాయం చేసారన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల మాదిరిగానే వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న టీచింగ్ ఉద్యోగులకు రిటర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలకు పెంచాలని ఎన్ని సార్లు విన్నవించుకున్న వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి వర్శిటీ యాజమాన్యం చొరవ తీసుకోలేదని ఆరోపించారు.

### ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అంటు రిజిస్ట్రార్ అవహేళన:

వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 20వ తేదీన టీచింగ్ అసోసియేషన్ తరపున టాసా ఆధ్వర్యంలో వర్శిటీ రిజిస్ట్రార్ కు ప్రజెంటేషన్ ఇస్తే టీచింగ్ ఉద్యోగులను ఆయన ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అనడం, హేళన చేస్తు మాట్లాడటం తీవ్ర మనస్థాపానికి గురి చేసిందన్నారు. భోజన విరామ సమయంలో వినతి ప్రతం ఇచ్చామని, దీనిని అవకాశంగా మలుచుకున్న యాజమాన్యం 13 మంది టీచింగ్ ఉద్యోగులకు మెమోలు జారీ చేసిందన్నారు. ఈ నెల 26న ఎంక్వయిరీ కమిటీ కి హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అద్యాపకుల హక్కులను కాలరాస్తు వర్శిటీ యాజమాన్య నిరంకుశ వైఖరి నిరసిస్తు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీచింగ్. రీసెర్చ్, ఎక్స్ టెన్షన్ ఉద్యోగులంత నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపడం జరిగిందన్నారు. ఇప్పటికైన వర్శిటీ యాజమాన్యం టీచింగ్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కార మార్గాలను అలోచించాలని కోరుతున్నా మన్నారు. లేని పక్షంలో తదుపరి కార్యచరణ ప్రకటించి రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.



రాజేంద్రనగర్ లో....




మూదోల్‌లో...




అదిలాబాద్ లో...

## "తెలుగు తేజం" జాతీయ అవార్డుకు ఎంపికైన జనగామ కవయిత్రి బుదారపు లావణ్య



జనగామ, ఆగస్ట్ 26 ( నమస్తే ఉదయం): తెలుగు భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఈనెల 31న ఆంధ్రప్రదేశ్ పల్నాడులో అందజేయనున్న తెలుగు తేజం జాతీయ పురస్కారానికి జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవయిత్రి బుదారపు లావణ్య ఎంపికైనట్లు నిర్వాహక సంస్థ అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక మంగళవారం ప్రకటించింది.జాతీయ స్థాయిలో నిరంతరంగా సాహితీ సృజన చేస్తున్న తెలుగు కవులు కవయిత్రులను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షుడు డా. కత్తిమండ ప్రతాప్ లావణ్య కు పంపిన ఆహ్వాన పత్రికలో తెలిపారు. దశాబ్ద కాలం నుండి విభిన్న అంశాలపై కవితలు పాటలు రాస్తూ స్వీయ గానంతో సామాజిక మాధ్యమాలలో యూట్యూబ్ లో పొందుపరుస్తూ సాహిత్యాభిమానుల మన్ననలు పొందుచున్న లావణ్యకు అవార్డు రావడం పట్ల జిల్లా కవులు,కళాకారులు, కళా,సాహితి సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. కవులు కళాకారుల ఐక్య వేదిక అధ్యక్షులు జి. కృష్ణ, అభినందన కల్చరల్ సొసైటీ అధ్యక్షులు అయిలా సోమనరసింహాచారి, కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షులు పెట్లోజు సోమేశ్వరా చారి,శ్రీశ్రీ కళావేదిక జనగామ జిల్లా అధ్యక్షులు లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, డాక్టర్ వేముల సదానందం, గడ్డం మనోజ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, కొట్టె శ్రీలత, త్రిపురారి పద్మ, వరూధిని తదితరులు ఈ సందర్భంగా లావణ్య కు అభినందనలు తెలిపారు.



పర్యావరణ గణపతులతో విద్యార్థులు

## విద్యార్థుల చేత పర్యావరణ గణపతుల తయారీ

బుద్వేల్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం):రాజేంద్రనగర్ సర్కిల్ శ్రీరాంనగర్ ప్రాథమిక పాఠశాల లో మంగళవారం విద్యార్థులచేత పర్యావరణ గణపతులను తయారు చేయించారు. పాఠశాల సాంస్కృతిక కమిటీ చైర్మన్ ఎస్ కే అల్లావలి ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు తయారు చేసిన పర్యావరణ గణపతులను వారికి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపద్యాయులు శంకర్, ఉపాధ్యాయురాలు లత లు పాల్గొన్నారు.

# తరిగొప్పుల మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

**ఫర్టిలైజర్ షాప్, కేజీవీబీ, జడ్పీ హై స్కూల్, ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన**

**యూరియా అమ్మకాలు సజావుగా సాగాలి**

**సరిపడా సిబ్బంది ఉండాలి**

**మధ్యాహ్న భోజనం తయారీ బాగుండాలి**

**పదవ తరగతి లో ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



తరిగొప్పుల మండలం లో ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేస్తున్నా జిల్లా కలెక్టర్

జనగామ ఆగష్టు 26 (నమస్తే ఉదయం):జిల్లా లో సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని...అమ్మకాలు పూర్తి అయ్యేంత వరకు ఫర్టిలైజర్ షాప్ యజమానులు సరిపడా సిబ్బంది ని పెట్టుకొని... రైతులకు ఇబ్బంది కలిగించ వద్దని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం తరిగొప్పుల మండలం లో కలెక్టర్ విస్తృత తనిఖీ లు, పరిశీలన లు జరిపారు. ముందుగా ఆగ్రోస్ సేవ కేంద్రాన్ని, పలు ఫర్టిలైజర్ షాప్ లను కలెక్టర్ సందర్శించి.... స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించి... ఎంత మందికి.. ఎన్ని బస్తాలు అమ్మారు అని..ఆయా రైతులకు ఎన్ని ఎకరాలు ఉన్నాయి తదితర వివరాలను చెక్ చేసారు. ఎక్కువ క్రౌడ్ కాకుండా షాప్ యజమానులు సరిపడా సిబ్బంది ని పెట్టుకొని.. యూరియా అమ్మకాలు త్వరగా అయ్యేలా చూసుకోవాలన్నారు రైతులను ఎక్కువసేపు వెయిటింగ్ చేపించకూడదన్నారు.అనంతరం కేజీవీబీ కి వెళ్లి....మధ్యాహ్న భోజన తయారీకి వాడుతున్న వంట సరుకులను, పప్పు ధాన్యాలను, కూరగాయలను పరిశీలించి... వంట కి వాడే ప్రతీ వస్తువు తాజా గా ఉండాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల దగ్గరికి వెళ్లి... లబ్ధిదారులతో మాట్లాడి ఇసుక, మొరం సమస్య లు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.తహసీల్దార్, ఎంపీడీఓ లు ఎప్పటికప్పుడు సమావేశాలు పెట్టుకొని ఇసుక, మొరం, కంకర ఇతరత్ర సామాగ్రి నిర్ణిత ధర లకే లబ్ధిదారులకు చేరేలా తగు ఆదేశాలు ఇవ్వాలన్నారు.చివరగా.. జడ్పీ హై స్కూల్ కి వెళ్లి... ఉపాధ్యాయుల హాజరు ను పరిశీలించి.... పదవ తరగతి విద్యార్థుల తో మాట్లాడి.. చదువు ఎలా సాగుతుంది అని, ఉదయం ఎన్ని గంటలకు నిద్ర లేస్తున్నారు, కష్టం గా ఉన్న సబ్జెక్ట్ లు చదువుతున్నార.. లేదా.... అని అడిగి... పదవ తరగతి పరీక్ష లు చాలా ముఖ్యమని... మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష లు పూర్తి అయ్యేవరకు ప్రతీ రోజూ సమయం వృధా కాకుండా ప్రాక్టీస్ చేయాలన్నారు.ఈ కార్యక్రమం లో వ్యవసాయ, విద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



బోల్తా పడిన కారు

## పీవీ ఎక్స్‌ప్రెస్ వేపై కారు బోల్తా

బుద్వేల్, ఆగస్టు 20 (నమస్తే ఉదయం) : పీవీ నర్సింహ్మారావు ఎక్స్ ప్రెస్ వే పై వేగంగా కారు నడిపి డివైడర్ ను ఢీ కొట్టి అవతలి రోడ్డులో పడ్డ కారు ఉదంతమిది. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం 5.40 నిమిషాలకు జరిగింది. దీంతో పీవీ నర్సింహ్మారావు ఎక్స్ ప్రెస్ వే పై ట్రాఫిక్ స్థంబించిపోయింది రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో బోల్తా పడిన కారును క్రిందికి చేర్చడం తో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. నాంపల్లి కి చెందిన మహ్మద్ ఖలీల్ (24) మంగళవారం మధ్యాహ్నం టీఎస్ 13 ఈ వై 3689 నెంబర్ ఎక్స్ ఎల్ యూ కారులో మరో మహిళతో కలసి వస్తున్నాడు. కారు వేగంగా ఉన్నందున పీవీ నర్సింహ్మారావు ఎక్స్ ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 212 ఉప్పర్ పల్లి ర్యాంప్ వద్ద డివైడర్ ను ఢీ కొన్నాడు. స్పీడ్ గా ఉండటంతో కారు రోడ్డు అవతల వైపు వెళ్లి బోల్తా పడింది. డ్రైవర్ కు కానీ పక్కన ఉన్న వారికి కాని ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

## శాంతియుత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలి

**రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్**

బుద్వేల్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం): వినాయక చవితి రోజు తో పాటు నవ రాత్రులు, నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేలా మండ పాల నిర్వాహకులు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పీడీపీ చౌరస్తాలోని ఐబీ ఫంక్షన్ హాల్ లో శాంతి కమిటి సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మండపాల నిర్వాహకులు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులనుద్దేశించి డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మాట్లాడారు. గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీసుల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. వినాయక చవితి నుంచి నవరాత్రులలో, నిమజ్జన ఊరేగింపులో ఎట్టి పరిస్థితులలో డీజే లకు అనుమతులు లేవన్నారు. మ ండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లు జరుగకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీలైతే మ ండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. మండపాల పరిసరాలలో శుభ్రత ఉండేటట్లు చూడాలన్నారు. కేబుల్ వైర్లు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండ చూసుకోవాలన్నారు. గణేశ్ మండపాల వద్ద మద్యం సేవించడం చేయరాదన్నారు. పేకాట ఆడటం, అసభ్యక నృత్యాలు చేయడం, ఇతరులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయవద్దన్నారు. వినాయక నవరాత్రులు నిమజ్జనోత్సవాలకు గట్టి పోలీస్ బందోబస్తు, నిఘా ఉం టుందన్నారు. ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్. మైలార్దేవుపల్లి ఇన్స్ పెక్టర్ లు నాగేశ్వర్ రావు , నరేందర్, నాయకులు మ్యాడం రామేశ్వర్ రావు, వై. శ్రీదర్. ఎం. కొమురయ్య, ఎన్ మల్లారెడ్డి, పి.మల్లేశ్ యాదవ్. జి.బాబురావు. సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సీనారే జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ వేము వందనం

## డాక్టర్ వేము వందనంకు సీనారే జీవన సాఫల్య పురస్కారం

బుద్వేల్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం): బవానీ కాలనీకి చెందిన కవి, రచయిత, నటుడు డాక్టర్ వేము వందనం సీనారే జీవన సౌఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ, ఇందిరా ఆర్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా నగరంలో ఆదివారం నిర్వహించిన సీనారే, దాశరథి జీవన సౌఫల్య పురస్కార వేడుకలలో ఆయన సీనారే జీవన సౌఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. గడిచిన 45 సంవత్సరాలుగా డాక్టర్ వేము వందనం అందుకున్న పురస్కారాలలో ఈ పురస్కారం 100వ ది కావడం విశేషం. ఈ కార్యక్రమంలో ఇందిరా ఆర్ట్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఎన్ ఇందిర, ఉపాధ్యక్షుడు డాక్టర్ అలూరి విల్సన్, తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజయ్య, కవి సమ్మేళన నిర్వాహకులు డాక్టర్ రామ క్రిష్ణ, చంద్రమౌళి, గోవిందరాజు, భాషాలు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవారత్న అవార్డులు ప్రధానం

శేరిలింగంపల్లి: ఆగస్టు26 (నమస్తే ఉదయం)మదర్ థెరిసా జయంతి పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవారత్న అవార్డుల ప్రదానం చేశారు. తమ తమ రంగాల్లో అంకితభావంతో పని చేసే వారికి ఎప్పుడూ సముచిత గుర్తింపు లభిస్తుందనీ, అటువంటి వారిని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుర్తించి సేవారత్న పురస్కారాల అందించడం ఎంతో ప్రోత్సాహకరమని ముఖ్య అతిథి హెచ్ సియు తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాదాపూర్ లోని స్వాతి హైస్కూల్ లో అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన యాదవ్ అధ్యక్షతన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సమాజంలో మానవసేవే మాధవసేవగా భావించి వివిధ రంగాలలో విశేషమైన సేవలందించిన అయిదుగురు సేవా మూర్తులకు ముఖ్య అతిథి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, మరో అతిథి రాగం మల్లికార్జున యాదవులు సేవారత్న అవార్డులను ప్రదానం చేశారు. ఎన్ సుజాత, ఎన్ శ్రీకాంత్, రాంమోహన్ సత్యసాయి సేవా దళ్ సభ్యులు డాక్టర్ రఘు అరికపూడి ఈ పురస్కారాల్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పడిన నాటి నుండీ అనేక సేవా కార్యక్రమాల్ని చేస్తుందని చెప్పారు. దీనిలో భాగంగా వివిధ రంగాల్లో అంకితభావంతో పనిచేసేవారిని గుర్తించడం మంచి నిర్ణయమని ఇటువంటి పురస్కారాల వల్ల నిజంగా పని చేసే వారికి ఎంతో ఆత్మతృప్తి లభిస్తుందని ప్రశంసించారు. మదర్ థెరిసా అత్యంత పేదలకు, కుష్టు రోగులకు, ఎయిడ్స్ బాధితులకు ప్రేమతో సేవ అభినందనీయం అన్నారు. సుమారు 45 సంవత్సరాలు మన దేశంతో పాటు ప్రపంచంలో అనేక దేశాలలో వేలాదిమంది పేదవాళ్లకు, వయోవృద్ధులకు మదర్ థెరీసా తన సేవలను విస్తరించారన్నారు. అల్బేనియాలో పుట్టిన మదర్ అనేక దేశాలలో జీవించినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆమెకు గౌరవనీయమైన



సేవారత్న అవార్డు లు అందుకున్న అవార్డు గ్రహీతలు.

పౌరసత్వాన్ని ప్రకటించాయని వివరించారు. అంత గొప్ప సేవకురాలు పేరు మీద సేవా పురస్కారాలు ఇవ్వడంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కి ఉన్న గొప్ప ఆశయం తెలుస్తుందన్నారు. తమకు తగిన గుర్తింపు లభించడం పట్ల పురస్కార గ్రహీతలు తమ ఆనందాన్ని వ్యక్తం చేయడంతో పాటు పురష్కరం మరింత మందికి స్ఫూర్తినిచ్చేలా పనిచేస్తామ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాగం మల్లికార్జున యాదవ్, స్వాతి హైస్కూల్ కరస్పాండెంట్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విఫణి కుమార్ ఎం.బసవ లింగం, సత్యసాయి సేవాసమితి, సభ్యులు డాక్టర్ రామన్న, బివికే రావు, సుబ్బారావు, మూర్తి, జివి రావు, విష్ణు ప్రసాద్, శివరాం కృష్ణ, పాలం శీను, విద్యార్థులు తదితరులు. పాల్గొన్నారు.



ఆస్పత్రిలో వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

# ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట, ఆగస్టు 26(నమస్తే ఉదయం) ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తకోట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల 3 కేసులు నమోదైన నేపథ్యంలో సంబంధిత ప్రాంతాల్లో యాంటీ లార్వా, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాట్ పరీక్షలను నిర్వహించి రోగులకు మెరుగైన చికిత్స అందించాలని చెప్పారు. డెంగ్యూ కు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ సాయినాథ్ రెడ్డి, తాసిల్దారు వెంకటేశ్వర్లు, ఇతర వైద్యాధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# ఉపాధ్యాయులకు వేతనాల పంపిణీ



## శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, ఆగస్టు 26 (నమస్తే ఉదయం) సేవా కార్యక్రమాల్లో శ్రీరంగం ఫౌండేషన్ ప్రజల సహాయార్థం ఎల్లప్పుడూ ముందుంటుందని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం అన్నారు.కూకట్ పల్లి నియోజకవర్గంలోని కెపిహెచ్బి రోడ్ నెంబర్ 2, బాలాజీనగర్ డివిజన్ వివేకనగర్ లోని ప్రాథమిక పాఠశాలలు యొక్క ప్రధాన ఉపాధ్యాయులు మీనా కుమారి, సృజనల అభ్యర్థన మేరకు ఉపాధ్యాయులకు వేతనాన్ని ఇవ్వమని కోరగా శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం ని కోరగా వారు వెంటనే స్పందించి శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2025 - 2026 విద్యా సంవత్సరం మొత్తం ప్రతి నెల వేతనాన్ని ఇస్తామని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం జులై నెల వేతనాన్ని చెక్కుల రూపంలో ఉపాధ్యాయులకు వారి కార్యాలయంలో శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా.సత్యం శ్రీరంగం చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రామకృష్ణాపురంలో ఘనంగా బోనాల ఉత్సవాలు





రామకృష్ణాపురంలో ఘనంగా బోనాల ఉత్సవాలు




గ్రామ దేవతలకు బోనాలతో నైవేద్యం సమర్పించిన గ్రామ మహిళలు

## గ్రామ దేవతలకు బోనాలతో నైవేద్యం సమర్పించిన గ్రామ మహిళలు

కొత్తకోట, ఆగస్టు 25( నమస్తే ఉదయం) మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో శ్రావణమాసంలో జరుపుకునే బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం గ్రామ దేవతలైన పెద్దమ్మ, పోచమ్మ అమ్మవార్లకు గ్రామ మహిళలు సామూహికంగా ఊరేగింపుగా బోనం సమర్పించారు. ఈ బోనాల ఉత్సవాలలో గ్రామ మాజీ సర్పంచ్ మూలమల్ల భీమిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరి భీమ్ రెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఎం శేఖర్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఎం చక్రి గిరి వర్ధన్ రెడ్డి, స్థానిక నాయకులు ఎం యుగంధర్ రెడ్డి, ఎం వెంకటేశ్వర్ రెడ్డి, ఎం లోకా రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బి రాములు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో

# బిజెపి సత్తా చాటాలి: ఎంపీడీకే అరుణ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 26(నమస్తే ఉదయం) రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పాలమూరు ఎంపీ, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డికె బంగ్లాలో జిల్లా పదాధికారుల నియామకం కమిటీని బిజెపి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ప్రకటించడం జరిగింది.

ఈ నియామక పత్రాలను పదాధికారులకు అందజేసి శాలువతో సత్కరించిన బిజెపి యువ నాయకురాలు డికె.స్నిగ్ధా రెడ్డి ఈ నియామకానికి సహకరించిన మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె. అరుణమ్మ కి, యువ నాయకురాలు డికె. స్నిగ్ధా రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.



జిల్లా ఉపాధ్యక్షులుగా సి రాజేష్ అయ్యా ,జి వెంకటేశ్వర్ రెడ్డి ,ఎం నల్లారెడ్డి ,మధుసూదన్ గౌడ్, ఎల్ అనసూయమ్మ, ఎస్ సంజీవరెడ్డి నియమించడం జరిగింది..

జిల్లా ప్రధాన కార్యదర్శిలుగా -రవి కుమార్ ఎక్బోటే, కెకె.రెడ్డి, శ్యామ్ సుందర్ రావ్, నియమించడం జరిగింది..

జిల్లా సెక్రెటరీగా- పి స్వప్న ,డి నాగరాజు, సుధాకర్ యాదవ్, బాలేశ్వర్ రెడ్డి, సి. మంజుల పద్మజ, హెచ్.తిమ్మన్న నియమించడం జరిగింది..

ట్రెజరర్ గా-మీర్జాపురం రామచంద్ర రెడ్డి ని నియమించడం జరిగింది..

జిల్లా మీడియా ఇంచార్జ్ గా - తెలుగు కేశవ్ ను నియమించడం జరిగింది..

ఆఫీస్ సెక్రెటరీ -దేవన్న ను నియమించడం జరిగింది..

సోషల్ మీడియా ఇంచార్జ్ గా - వేణు గోపాల్ ను నియమించడం జరిగింది..


ఐటీ సెల్ కన్వీనర్ గా -వినిత్ ను నియమిచడం జరిగింది..

ఈ సందర్భంగా బిజెపి యువ నాయకురాలు డీకే స్నిగ్ధా రెడ్డి గారు మాట్లాడుతూ.

బిజెపి పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి జిల్లా పదాధికారుల బాధ్యత కీలకమని అన్నారు ..

ప్రజలతో మెరుగైన సంబంధాలు ఏర్పరచుకోవడం వారి సమస్యలను అర్థం చేసుకోవడం పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం మరియు బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేసే బాధ్యత జిల్లా పదాధికారులందరిదని అని అన్నారు. పార్టీలో కొత్త నాయకత్వాన్నీ అభివృద్ధి చేయడం , వారికి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయలని అన్నారు..

ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు మండల వెంకట రాములు అక్కల రమాదేవి,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ,జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాస్ , బిజెపి నాయకులు హాజరయ్యారు..




# ఇసుక లారీ పట్టివేత

ఉండవల్లి,ఆగస్టు26(నమస్తే ఉదయం)ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని మంగళవారం ఉండవెల్లి పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. కర్నూల్ జిల్లా నుంచి అక్రమంగా గద్వాల జిల్లా మీదుగా హైదరబాద్ కు ఇసుక తరలిస్తున్న క్రమంలో మంగళవారం ఉండవెల్లి మండలం పుల్లూరు టోల్ ప్లాజా వద్ద ఇసుక లారీని సీజ్ చేసి.. కేసు నమోదు చేసినట్లు ఉండవల్లి ఎస్సై ఆర్. శేఖర్ తెలిపారు.

# మట్టి వినాయకులను పూజించండి పర్యావరణాన్ని కాపాడండి




గద్వాల టౌన్, అగస్టు 26 (నమస్తే ఉదయం)మట్టి వినాయకులను పూజించండి పర్యావరణాన్ని కాపాడండి అని అక్షర కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపల్ రత్నం పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మంగళవారం అక్షర స్కూల్ లో విద్యార్థులు మట్టి ప్రతిమలను తయారీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

# భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలు

## నేటి నుంచే అమల్లోకి రానున్న ట్రంప్ ఆదేశాలు సవాళ్లకు సిద్ధంగా ఉన్నామన్న ఆర్‌బిఐ


**వాషింగ్టన్, ఆగస్టు 26 (నమస్తే ఉదయం)**

భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్.. రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్‌పై మరో 25 శాతం టారీఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఆగస్టు 6న ఈ ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై 14329పై సంతకం చేసిన ట్రంప్..ఈ నెల 27 నుంచి 50 శాతం టారీఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. దీంతో తాజాగా 25 అదనపు సుంకాలపై అమెరికా అధికారికంగా బహిరంగ నోటీసులు జారీ చేసింది. భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కొత్త సుంకాలు ఆగస్టు 27 తెల్లవారుజాము 12.01 గంటల నుంచే అమల్లోకి వస్తాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా హోమ్‌లాండ్ ఆఫ్ సెక్యూరిటీ- విడుదల చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అధిక సుంకాల్లో మొత్తం ఎగుమతిదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటే.. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాత్రం టారిఫ్‌ల ప్రభావంపై మాట్లాడారు. యుఎస్ విధించిన 50 శాతం టారిఫ్‌లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. యుఎస్ టారిఫ్‌లు దేశీయ ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తే ఆర్‌బిఐ తగిన విధాన చర్యలతో స్పందిస్తుందన్నారు. మేము బ్యాంకింగ్ రంగానికి తగినంత నగదు లభ్యతను అందించాము. ముఖ్యంగా ఎక్కువగా ప్రభావితమైన రంగాలకు మద్దతును ఇవ్వడానికి




అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాము. ఆర్‌బిఐ ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే మరోవైపు ఆర్థిక వృద్ధిపై దృష్టి కోల్పోలేదని మల్హోత్ర అన్నారు.భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని మల్హోత్ర ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ వద్ద ఇప్పటికే 695 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్య నిల్వలు ఉన్నాయని.. ఇవి 11 నెలల విదేశీ వాణిజ్యానికి సరిపోతాయన్నారు. సుంకాల మొత్తం ప్రభావం తక్కువగా ఉంటు-ందని మల్హోత్ర తెలిపారు. అయితే.. రత్నాలు, ఆభరణాలు, -టె-క్స్-టైల్స్, దుస్తులు, ఎంఎస్‌ఎంఇ రంగాలపై కొంత ప్రభావం ఉండవచ్చన్నారు. ప్రభుత్వం ఉచిత వాణిజ్య ఒప్పందాలపై కూడా దృష్టి సారిస్తోందన్నారు. వృద్ధికి తమ వంతుగా ఇప్పటికే రెపోరేటు-ను 100 బేసిస్ పాయింట్లు- తగ్గించిందని గుర్తు చేశారు. అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అంశాలను అధిగమించేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. బ్యాంక్ రుణాలను విస్తరించేందుకు అవసరమైన చర్యలను తాము పరిశీలిస్తున్నామన్నారు. పెట్టుబడుల సైకిల్‌ను సృష్టించేందుకు వీలుగా కార్పొరేట్‌లు, బ్యాంక్‌లు ఓ తాటి పైకి వచ్చి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే దేశాభివృద్ధి ముందు కెళ్తుందని మల్హోత్ర అన్నారు. ధరల స్థిరీకరణ, ఆర్థికవృద్ధే లక్ష్యంగా ద్రవ్య పరపతి విధానం కొనసాగుతుం దన్నారు. స్థూలంగా భారత ఆర్థికవ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయన్నారు.

# జీవన ఎరువులు.. పంటకు సిరులు


సంగర్తి హరీష్

మొక్కకు పోషకాలను అందించే సూక్ష్మజీవుల సమూదాయమే జీవన ఎరువులు... హరిత విప్లవం తరువాత అందుబాటులోనికి వచ్చిన సంకర వంగడాల సాగులో అధిక దిగుబడులే ధ్యేయంగా సాగిన మన వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగింది దీనివల్ల భూములు నిస్సార మవటం, వాతావరణ కాలుష్యం పంట ఉత్పత్తిలోని అవశేషాల వల్ల తలెత్తుతున్న ఆరోగ్య సమస్యలు ఇలా అన్ని అనర్థాలే రసాయన ఎరువుల వాడకం తగ్గించి భూమిలోని పోషకాలను మొక్కలకు అందేలా దోహదపడేవి జీవన ఎరువులు ..జీవన ఎరువులు వాడకంతో రైతులకు ఖర్చు తగ్గడమే కాదు భూమిలో సేంద్రీయ పదార్థం పెరిగి నాణ్యమైన దిగుబడులను పొందవచ్చు .వీటిలో నత్రజని. భాస్వరం.జింక్. పొటాషియంను స్థిరీకరించే జీవన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. జీవన ఎరువులు అంటే నేల మరియు వాతావరణంలో ఉన్న పోషకాలను గ్రహించి మొక్కకు అందించే సూక్ష్మ జీవుల సమూదాయన్నే జీవన ఎరువులు అంటాం నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువులు...

రైజోబియం, అజటోబాక్టర్, ఆజోస్పిరిల్లం , అజోల్లా, ఫాస్ఫోబ్యాక్టీరియా,

పొటాషియంను కరిగించే బ్యాక్టీరియా, జింక్ ను కరిగించే బ్యాక్టీరియా..

ఇవన్నీ నత్రజనిని స్థిరీకరించే జీవన ఎరువులు..

రైజోబియం :

రైజోబియం జీవన ఎరువులు పప్పు జాతి పంటలైన పెసర. అలసంద .సోయా మినుము కంది పంటలకు రైజోబియం జీవన ఎరువులు వాడుతుంటాం. రైజోబియం అను బ్యాక్టీరియా మొక్కలతో కలిసి నత్రజనిని స్థిరీకరిస్తుంది. ఈ రకమైన సూక్ష్మజీవులను పప్పుజాతి పంట మొక్కల వేర్లతో సహజీవనం చేస్తూ గాలిలో ఉన్న 78 నత్రజనిని మొక్కల వేర్లను ఆకర్షించి వేర్లమీద గులాబీ రంగు కలిగిన వేరు బుడిపలను ఏర్పాటు చేస్తాయి

అజటోబాక్టర్....

ఈ సూక్ష్మ జీవులు నేలలో ఒంటరి గా ఉంటూ మొక్కలకు నత్రజనినీ స్థిరీకరిస్తాయి .మరియు మొక్క పెరుగుదలకు దోహదపడే ఇతర హార్మోన్లను విటమిన్లను అందించి వేరు పెరుగుదలకు తోడ్పడతాయి అంతేకాకుండా మొక్కలకు వ్యాధి నిరోధక శక్తిని మరియు బెట్టను తట్టుకునే శక్తిని పెంచుతాయి ఈ బ్యాక్టీరియా ముఖ్యంగా కార్బన్ ఎక్కువగా ఉన్న భూములలో సమర్థవంతంగా పనిచేస్తుంది ఈ జీవన ఎరువులు అన్ని వాణిజ్య పంటలైన మిరప. పత్తి , చెరుకు ,పొద్దుతిరుగుడు కుసుమలు, ఆకుకూరలు కూరగాయలు పూలు మరియు పండ్లతో సిఫారసు చేయబడిన మోతాదులో వాడి మంచి ఫలితాలు పొందవచ్చు

ఆజోస్పిరిల్లం ...

ఈ బ్యాక్టీరియా మొక్క వేరుల చుట్టూ పెరుగుతూ అవకాశమున్నచోట వేర్లలోకి చొరబడి వాటి సంఖ్యను అభివృద్ధి చేసుకుంటుంది .దీని కారణంగా ఈ జీవన ఎరువులు స్థిరీకరించిన నత్రజనిని నేరుగా మొక్కకు ఎక్కువ శాతం అందుబాటులో ఉంచును. ఈ మధ్యకాలంలో ఈ ఆజోస్పిరిల్లం ప్రాముఖ్యత సంతరించుకుంది ,ఎందుకంటే ఈ బ్యాక్టీరియా సేంద్రియ కర్బనం తక్కువగా ఉన్న నేలలో కూడా సమర్థవంతంగా పనిచేసే మొక్క పెరుగుదలకు దోహదం చేస్తుంది. అజొస్పిరిల్లం జీవన ఎరువులు వారి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, రాగి,సజ్జ, పొద్దుతిరుగుడు కూరగాయలు మరియు అరటి మొదలైన పంటలకు బాగా ఉపయోగపడుతుంది..

అజోల్లా....

అజోల్ల అనేది ఒక చిన్న జలచర ఫెర్న్ . దీనిని వివిధ రకాలుగా ఉపయోగించవచ్చు .ఇది ముఖ్యంగా పశువులకు దానాగా, సేంద్రియ ఎరువుగా మరియు వరి పొలాలలో నత్రజని అందించడానికి ఉపయోగిస్తారు. అలాగే కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించడానికి మరియు దోమల నియంత్రణకు కూడా ఇది ఉపయోగపడుతుంది . అజోల్లాలో నత్రజని ఉంటుంది , కాబట్టి ఇది నేల సారవంతం చేయడానికి ఉపయోగపడుతుంది ఇది రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది మరియు వరి పొలాలలో నత్రజని అందించడానికి బాగా ఉపయోగపడుతుంది

పాస్ఫోబ్యాక్టీరియా .. (భాస్వరం అందించే జీవన ఎరువు)..

పంట పొలాల్లో వాడిన బాస్వరం భూమిలో వేసిన కొద్ది రోజుల వ్యవధిలో భూమి యొక్క ఉదజని సూచికను బట్టి వివిధ రకాలైన లభ్యం కానీ భాస్వరం ఇనుము లేదా అల్యూమినియం ఫాస్పేట్లుగా మరియు క్షార గుణం ఉన్నచో కాల్షియం లేదా మెగ్నీషియం ఫాస్పేట్లుగా మారి మొక్కకు లభ్యం కాకుండా భూమిలో గడ్డలుగా పేరుకుపోతుంది ఈ పరిస్థితులలో భాస్వరం కరిగించే జీవన ఎరువులు బాసిల్లస్, గాని సుడోమోనాస్ ,గానీ పంటలలో వేసినచో స్థిరీకరించిన భాస్వరంను మొక్కకు లభ్యస్థితిలోకి మార్చి మొక్కలకు ఉపయోగం లోకి తీసుకొని రాబడుతుంది..

పొటాషియంను మొక్కలకు అందించేవి

ఈ రకమైన జీవన ఎరువులు వాడటం వలన నేలలోని పొటాషియం యొక్క లభ్యత పెరిగి మొక్క పెరుగుదలకు తోడ్పడుతుంది బ్యాక్టీరియా ఉత్పత్తి చేసే వివిధ రకాల ఎంజైములు మరియు ఆమ్లాల వలన కరగని స్థితిలో ఉన్న పొటాషియం కరిగి మొక్కకు అందజేస్తుంది ఈ జీవన ఎరువులు అన్ని రకాల పంటలకు వేసుకోవచ్చు..

జింక్‌ను కరిగించే సూక్ష్మజీవులు...

ప్రస్తుత వ్యవసాయంలో జింకు పోషకం చాలా వరకు పెరిగింది. మనం తీసుకునే ఆహారంలో జింక్ దొరకడం లేదు ఎక్కువగా జింక్ లోపం పంట పొలాలలో గమనించవచ్చు దీని యొక్క లభ్యత పంట పొలాల్లో పెంచుటకు జింకును కరిగించే సూక్ష్మ జీవిని వాడినట్లయితే నేలలో ఉండే జింక్ ను కరిగించి మొక్కలకు అందిస్తుంది ఈ బ్యాక్టీరియాను అన్ని రకాల పంటల్లో వాడుకొని జింకు లభ్యతను పెంచుకోవచ్చు......

జీవన ఎరువులను ఉపయోగించే పద్ధతులు...

విత్తనశుద్ధి ద్వారా

ఒక కిలో విత్తనమునకు 15 నుండి 20 గ్రాముల జీవనఎరువును సమానమోతాదులో 10 చక్కెర లేద బెల్లం ద్రావణానికి కలిపి విత్తనం చుట్టూ సమానంగా పట్టునట్లు కలప వలయును తరవాత 30 నిమిషాలు నీడలో ఆరబెట్టి విత్తనం విత్తుకోవలెను ,జీవన ఎరువులు, విత్తుకునే ముందు మాత్రమే పట్టించాలి .......

నారును ముంచి నాటే పద్ధతి...

ఈ పద్ధతి ముఖ్యంగా అజోస్పిరిల్లం అనే జీవన ఎరువు వాడటానికి ఉపయోగపడను. సుమారు ఒక కిలో జీవన ఎరువును70 నీటిలో కలిపి నారుమడులలో చిన్నకుంట చేసి దానీలో పోయవలెను ఈ నీటిలో పీకిన నారు యొక్క వేర్లను 10 నిమిషాలు ముంచి తదుపరి నాట్లు వేసుకోవలెను.......

భూమిలో వేసే పద్ధతి.. ..

రెండు కిలోల జీవన ఎరువులు దాదాపు 200 కిలోల పశువుల ఎరువులతో గాని వానపాముల ఎరువులలో గాని లేదా మరి ఇతర సేంద్రియ ఎరువుతో గాని కలిపి విత్తనమును నాటి సాళ్ళలో పడేటట్లు వేసుకోవలెను ఎట్టి పరిస్థితుల్లోనూ పంట పొలంలో చేపట్టే మొదటి అంతరకృషి చేయుటకు ముందుగా జీవన ఎరువులు వాడటం ముగించవలెను.....

**జీవన ఎరువుల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు...**

జీవన ఎరువు ప్యాకెట్ మరియు బాటిల్స్ ను ఎండ తగలని నీడ ప్రదేశాలలో నిలువ చేయవలెను.

జీవన ఎరువులు గడువు తేదీ లోపల మాత్రమే ఉపయోగించాలి

రసాయనకి ఎరువులు లేదా పురుగు మందులతో కలిపిన జీవన ఎరువులను వాడకూడదు

సేంద్రియ ఎరువులతో కలిపిన జీవనఎరువును వాడుకుంటే బాగా పనిచేస్తాయి ...

**సంగర్తి హరీష్. ఎమ్మెస్సీ అగ్రికల్చర్,**
**డిపార్ట్ మెంట్: వ్యవసాయ సూక్ష్మ జీవశాస్త్రం, జీవఉత్పత్తి విభాగం..**
**సెల్: 8500598177**
**ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం**


ఆస్పత్రిలో గాయపడిన మహిళను పరామర్శించిన బిజెపి నాయకులు

# పాత కక్షకతో మహిళపై దాడి

## గద్వాల న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో దారుణం

### మహిళపై దాడి చేసిన ఓ పోలీస్ అధికారి కుటుంబం సభ్యులు!

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 26(నమస్తే ఉదయం)పాత కక్షలు నేపథ్యంలో ఓ మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీలో నివసిస్తున్న బీజేపీ నాయకులు అనీల్ కుమార్ కుటుంబ తో పక్కింట్లో నివసిస్తున్న ఓ పోలీస్ అధికారి కుటుంబంతో గత కొంతకాలంగా అకారణంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నాగమ్మతో శారద కుటుంబ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో నాగమ్మ పై శారద కుటుంబ సభ్యులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. గాయపడిన మహిళను చికిత్స కోసం గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న ఓ పోలీస్ అధికారి కుటుంబ సభ్యులే విచక్షణ రహితంగా దాడికి పాల్పడినట్లు బాధితురాలి భర్త అనిల్ కుమార్ ఆరోపించారు. . నిజాయితీగా, పారదర్శకంగా పోలీసుకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయాలని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**దాడిని ఖండించిన బీజేపీ నాయకులు**

బీజేపీ నాయకులు అనీల్ కుమార్ భార్య నాగమ్మ పై జరిగిన దాడిని బిజెపి నాయకులు తీవ్రంగా ఖండించారు. తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి డి కె స్నిగ్ధారెడ్డి, పలువురు నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా వారు ఆరోపించారు.


బమ్మెరలో శ్రీ పోతన సాహిత్య కళావేదికఆధ్వర్యంలో విరభద్రుని జయంతి వేడుకలు

# బమ్మెరలో ఘనంగా జరిగిన వీరభద్రుని జయంతి వేడుక

జనగామ, ఆగష్టు 26(నమస్తే ఉదయం): జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో శ్రీ పోతన సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం వీరభద్రుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం భాద్రపద మాసంలో మొదటి మంగళవారం రోజున వీరభద్రుని జయంతిని జరుపుకుంటారు. బమ్మెర పోతన రచించిన మొట్టమొదటి కావ్యం వీరభద్ర విజయం రచించిన రోజు కూడా ఇదే కావటం విశేషం ఈ సందర్భంగా శ్రీ పోతన సాహిత్య కళావేదిక అధ్యక్ష కార్యదర్శులు శ్రీ వీరభద్రుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వీరభద్రుని, బమ్మెర పోతనను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షులు మాన్యపు భుజేశీదర్, ప్రధాన కార్యదర్శి దేవసాని ఉపేందర్, కళ్లెం నరసింహులు, దేవసాని నరేష్, సోమ సాయి, బత్తిని రవి, మాడరాజు సోమయ్య, భార్గవ్, అఖిల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


బ్రాంచి పోస్ట్ మాస్టర్స్ కు పింఛన్ కిట్ల ను పంపిణీ చేస్తున్నా జిల్లా కలెక్టర్

# బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు పింఛన్ కిట్ల పంపిణి

## అర్హులకు సరైన సమయం లో సులువుగా పెన్షన్

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, ఆగష్టు 26 (నమస్తే ఉదయం): అర్హులైన ప్రతి పేదవాడికి పింఛన్ల పంపిణీ మరింత మెరుగ్గా జరిగేందుకు జిల్లాలోని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు కొత్త మొబైల్ ఫోన్లు, ఫింగర్ ప్రింట్ డివైస్లు ఇతర సాంకేతిక పరికరాలు కిట్లను మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొత్తం సెట్లు 167 జిల్లాకు మంజూరయ్యాయని, ఆధునిక పరికరాల ద్వారా ఫేస్ రికగ్నైజేషన్ సులువుగా జరుగుతుందన్నారు.లేదంటే మంత్ర డివైస్ ద్వారా గాని ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా గాని ఫించను పంపిణీ చేయవచ్చన్నారు. అతి తక్కువ సమయంలో ఈ పరికరాలతో ఎక్కువ మందికి పింఛన్లు పంపించడానికి అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమం లో డిఆర్డిఓ వసంత , ఏపీడీ నూరోద్దీన్ , డీపీఎం పెన్షన్స్ ఏ సతీష్ , గిరి బాబు, ఆన్లైన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ , పోస్టల్ డిపార్ట్మెంట్ ఏఎస్పి కృష్ణ , నవీన్ , సిఎచ్. భాస్కర్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. “RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733